క్లుప్తంగా

కేపీపాలెం నార్త్‌లో పోస్టర్ల తొలగింపు



కేపీ పాలెం నార్త్‌లో పోస్టర్లు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మొగల్తూరు: సాధారణ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో గ్రామాల్లోని బహిరంగ ప్రదేశాలు, గోడలు మీద అంటించిన పోస్టర్లు, బ్యానర్లు పంచాయతి సిబ్బంది తొలగిస్తున్నారు. మంగళవారం మండలంలోని కేపీ పాలెం నార్త్ గ్రామంలో పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించడంతో పాటు, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయమని తమ సిబ్బందిని ఆదేశించినట్లు గ్రామ కార్యదర్శి గంగన్న తెలిపారు. గ్రామస్తులతో పాటు రాజకీయ పార్టీల నాయకులు నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని తమ సిబ్బందిని ఆదేశించామని ఆయన వివరించారు.

ఘనంగా ముంతాలమ్మ జాతర

యలమంచిలి: యలమంచిలి గ్రామ దేవత మూలస్థానేశ్వరీ దేవి (ముంతాలమ్మ) అమ్మవారి జాతర మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన హంస వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. జాతరలో ఢిల్లీకి చెందిన కళాకారుల అఘోరా నృత్యం, భద్రాచలానికి చెందిన కళాకారుల కోయ డ్యాన్సులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జాతర ముగిసిన తరువాత బుధవారం నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆఖరి రోజున ఈ నెల 24న మాంసాహారంతో అన్నసమారాధన ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

యలమంచిలి: మండలంలోని అడవిపాలెం పల్లపువీధిలోని ఒక కొబ్బరితోటలో పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను మంగళవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై కాకి శివనారాయణ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1460 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు.

నేడు పాలకొల్లులో వెంకన్న కల్యాణం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక కెనాల్ రోడ్డు గాంధీ బొమ్మల సెంటర్ వద్ద ఉన్న శ్రీ భూ నీళా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు 24 ఆదివారం వరకూ నిర్వహించనున్నారు. మంగళవారం విష్వక్సేన పూజ, ధ్వజారోహణ అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభించారు. బుధవారం రాత్రి 7 గంటలకు గోవర్ధనం శోభనాద్రి ఆచార్యుల బ్రహ్మత్వంలో స్వామి వారి కల్యాణం జరిపించనున్నారు. ఆదివారం ఉదయం పూర్ణాహూతి, చక్రస్నానం రాత్రి 7 గంటలకు 12 ప్రదిక్షణాలు, 12 ఆరగింపులు, 12 హారతులతో స్వామివారికి శ్రీ పుష్పయాగ మహోత్సవం నిర్వ హించనున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త గ్రంది మురళీకృష్ణ, ప్రధానార్చకులు మరుధూరి నరసింహాచార్యులు ఉత్సవ ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు 5వ వార్డులో ఎన్నికల ప్రచారం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు పట్టణంలోని 5వ వార్డు యూనియన్ బ్యాంక్ వద్ద నుంచి బుధవారం ఉదయం 8గంటల నుంచి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వార్డు ఇన్‌చార్జ్‌లు ప్రచారంలో పాల్గొనాలని ఆయన కోరారు.

బీసీలకు సముచిత స్థానం

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



పెనుగొండ: మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుతో శెట్టిబలిజ సంఘాల నాయకులు



పోడూరు: జగన్నాథపురం గ్రామంలో పర్యటిస్తున్న మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళ వారం తూర్పుపాలెంలో పెనుగొండ చెరుకువాడలోని బీసీ కమ్యూనిటీ భవన పరిసర ప్రాంత శెట్టిబలిజ సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నరసాపురం పార్లమెంటు నియోజకవర్గం 65 ఏళ్లలో తొలిసారిగా శెట్టి బలిజ మహిళకు సీఎం జగన్ కేటాయించారన్నారు. అంతేగాకుండా జిల్లాలో రెండు సీట్లు బీసీలకు కేటాయించారన్నారు. చంద్రబాబు మాటలకు, చేతలకు పొంతన ఉండదన్నారు. మభ్యపెట్టడమే నైజంగా చంద్రబాబు జీవిస్తున్నారన్నారు. ప్రజలను ఎప్పుడూ మోసం చేస్తూనే ఉంటారన్నారు. సీఎం జగన్‌ను ఒంటరిగా తట్టుకోలేక పొత్తులతో పోటీకి వస్తున్నారన్నారు ఎంతమంది జట్టు కట్టి వచ్చినా వైఎస్సార్ సీపీదే విజయమన్నారు. ఆచంటలోనూ వైఎస్సార్ సీపీ భారీ విజయంతో కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. చంద్రబాబు బాటలోనే స్థానిక నాయకులు ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా విజయాన్ని ఆపలేరన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సేవా కార్యక్రమాలే అండగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతి నీడి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకుడు కుడిపూడి సుబ్రహ్మణ్యం, సంఘాల నాయకులు కడలి సాయి, పెచ్చెట్టి బాలు, పెచ్చెట్టి సతీష్, పంపన శ్రీను, సానబోయిన భూషణం, గుడాల రామకృష్ణ, కడలి సిద్దయ్య, పెచ్చెట్టి చంద్ర, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి సత్యనారాయణ, వాసంశెట్టి పాండు, చిట్టూరి గంగయ్య, కడలి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రంగనాథరాజుకు బ్రహ్మరథం

పోడూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఎన్నికల శంఖారావం పాదయాత్రలో భాగంగా మంగళవారం జగన్నాథపురం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలు, అవ్వ తాతలు, యువత ఆయనకు అడుగడుగు నా బ్రహ్మరథం పట్టారు. వృద్ధులను, మహిళలను, రైతన్నలను శ్రీరంగనాథరాజు ఆప్యాయంగా పలుకరిస్తూ ముందుకు సాగారు. ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధిస్తుందనీ, సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. గడిచిన 5 ఏళ్లలో నియోజకవర్గంలో అన్నిగ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. సచివాలయ, వలంటరీ వ్యవస్థ ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హులైన లబ్ధిదారులకు ఇంటింటికీ సంక్షేమ పథకాలను చేరవేశారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన నవరత్నాలహామీతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రికార్డు స్థాయిలో సంక్షేమ పథకాలను అందించారన్నారు. రానున్నరోజుల్లో నియోజకవర్గంలో అన్ని గ్రామాలను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేయడమే లక్ష్యంగా అన్ని గ్రామా ల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత ఉత్సాహంగా పనిచేయాలని ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, గ్రామసర్పంచ్ గుడాల శిరీషచంటి, ఎంపీటీసీ సభ్యురాలు దిద్దే అఖిల, మండల కన్వీనర్ పిల్లి నాగన్న తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ అంశంలో ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న కమిషనర్ కె.వెంకటేశ్వరరావు

నరసాపురం: శానిటేషన్ అంశంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయాలని మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ తన చాంబర్‌లో శానిటేషన్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా పట్టణంలో దోమలు పెరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. డ్రెయిన్స్‌లో సిల్ట్ తీయించాలన్నారు. పట్టణంలోని 31 వార్డుల్లో అన్ని డ్రెయిన్స్ శుభ్రం చేయించాలని చెప్పారు. శానిటేషన్ విషయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు పాతపాడులో ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచారం

మొగల్తూరు: మండలంలోని పాతపాడు గ్రామంలో బుదవారం ప్రజాశ్వీరాధ ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ ఈపీ మండల కన్వీనర్ కర్రి ఏసుబాబు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పాలకొల్లులో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తాం

గుడాల శ్రీహరి గోపాలరావు



పాలకొల్లు బ్రాడీపేటలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలు ఆదరణ చూపుతున్నారని, కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో పాలకొల్లులో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తామని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) స్పష్టం చేశారు. పాలకొల్లు 1వ వార్డు బ్రాడీపేటలో మంగళవారం గోపి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ప్రజల ముందుకు వెళ్తున్నప్పుడు లబ్ధిదారులే స్వయంగా తమకు రూ.5లక్షలు నుంచి రూ.10లక్షల వరకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని చెబుతున్నారన్నారు. గతంతో పోలిస్తే ప్రజల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ప్రజల స్పందన చూస్తుంటే ఎమ్మెల్యే నిమ్మల ఇంటికెళ్లడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పట్టణ ప్రజలను పీడిస్తున్న మురుగు సమస్య పరిష్కరించడానికి గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.8 కోట్లు నిధులు మంజూరైతే ఎమ్మెల్యే నిమ్మల 20 శాతం కమిషన్‌ను కాంట్రాక్టర్ నుంచి డిమాండ్ చేయడం వల్లనే పనులు నిలిచిపోయాయని గుడాల గోపి చెప్పారు. అలాగే టిడ్కో గృహాల లబ్ధిదారులను బ్యాంక్‌లకు తాకట్టు పెట్టింది కూడా గత టీడీపీ ప్రభుత్వమేనని, వీటిపై జీవో నెంబర్‌తో సహా ఫ్లెక్సీలు వేసి బహిరంగ విచారణకు సవాల్ చేశానన్నారు. అయితే తప్పులు చేసిన నిమ్మల విచారణకు రాకుండా మొహం చాటేశారని వివరించారు.

మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

పట్టణ ప్రజలను పీడిస్తున్న దమ్మయ్యపత్తి, బెజవాడ కోడు మురుగు నీటి సమస్య పరిష్కరించడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు గుడాల గోపి వివరించారు. పాలకొల్లు మండలం దగ్గులూరు మెడికల్ కళాశాల పూడిక పనులకు ఎమ్మెల్యే నిమ్మల అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే జగనన్న కాలనీ మట్టి పూడిక పనులను సైతం ఎమ్మెల్యే నిమ్మల అడ్డుకోవడం వల్లే పేదల ఇంటి నిర్మాణాలు ఆలస్యమైనట్లు గోపి వివరించారు. ఈ ఎన్నికల్లో తన విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరు పెద్దిరాజు, వైఎస్సార్ సీపీ చింతలపూడి పరిశీలకులు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ చైర్మన్ యడ్ల తాతాజీ, ఏఎంసీ చైర్మన్ సాలా దేవి, ఏఎంసీ వైస్ చైర్మన్ పెన్మెత్స వెంకట సూర్యనారాయణరాజు (డీటీడీసీ బాబు), మాజీ చైర్మన్ సాలా నరసయ్య, మండల కన్వీనర్లు చందక సత్తిబాబు, విప్పర్తి ప్రభాకరరావు, ఎం మైఖేల్‌రాజు, పితాని సత్యనారాయణ, పట్టణ యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఖండవల్లి వాసు, పట్టణ కన్వీనర్ మోర్త గిరీష్, వార్డు ఇన్‌చార్జ్ యలకల రంగ పాల్గొన్నారు.

గుడాల గోపి, యడ్ల తాతాజీలకు సత్కారం...

పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడుగా నియమితులైన గేదల నరసింహారావు బ్రాడీపేట 1వవీధిలో యూత్ నాయకులు గుడాల గోపి, యడ్ల తాతాజీలను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

పది పరీక్షలు ప్రశాంతం



పెనుమంట్ర: ఉన్నత పాఠశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

మొగల్తూరు: మండలంలోని పదోతరగతి పరీక్షలు రెండో రోజు ప్రశాంతంగా ముగిశాయి. మంగళ వారం రెండో రోజు నిర్వహించిన హిందీ పరీక్షకు మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాల ద్వారా 879 మంది విద్యార్థులు హాజరుకావల్సి ఉండగా 829 మంది విద్యార్థులు మాత్రమే హాజరవగా, 50 విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఎంఈఓ శామ్యూల్ జాన్ తెలిపారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: పదోవ తరగతి పబ్లిక్ పరీక్షలు రెండవ రోజు కూడా ప్రశాంతంగా జరిగాయి. మంగళ వారం 38 మంది గైర్హాజరు కాగా, 468 మంది విద్యార్థులు హిందీ పరీక్ష వ్రాసారు. పెనుమంట్ర జెడ్పీ ఉన్నత పాఠశాలలో 166 మందికి 156, పాలమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 80 మందికి 69 మంది, మార్టేరు శ్రీవేణుగోపాల ఉన్నత పాఠశాలలో 177మందికి 164మంది, మార్టేరు బాలికోన్నత పాఠశాలలో 83 మందికి 79 మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓ యు.గేశ్వరరావు తెలిపారు.

తూర్పు కాపుల ఓబీసీ సమస్య పరిష్కరించాలి



మంత్రి చెల్లుబోయిన, ఎమ్మెల్సీ కవురుతో కలిసిన తూర్పుకాపు సంఘ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: తూర్పు కాపుల ఓబీసీ సమస్యను పరిష్కరించాలని తూర్పుకాపు సంఘ నాయకులు లోపించి చిరంజీవి అన్నారు. మంగళ వారం రాజమండ్రిలో మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసులను కలిశారు. తూర్పు కాపులను బీసీ జాబితాలో చేర్చమని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రిఫరెన్స్ ఇచ్చిందని తెలిపారు. ఎన్నికల తర్వాత పార్లమెంటులో గెజిట్ ద్వారా ఓబీసీ వస్తుందని ఆశిస్తున్నామన్నారు. అలాగే రాబోయే రోజుల్లో రాజకీయంగా తూర్పుకాపులకు అధిక ప్రాధాన్యత కల్పించేలా కృషి చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. పట్టణ వైఎస్సార్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ బాకూరి సత్యనిరంజన్, పైలా శ్రీను, కోడిగుట్ల రాంబాబు, గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



ఆచంటలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: ఎన్నికలు నిబంధనలు తప్పని సరిగా పాటించాలని అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆచంట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు హెచ్చరించారు. మంగళవారం ఆచంట తహసీల్దారు కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, విలేకర్లతో ఏర్పాటు చేసిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. పార్టీలు 19 రకాల అనుమతులు సువిధలో సింగిల్ విండో ద్వారా తీసుకోవచ్చునన్నారు. చిహ్నాల ముద్రించడం, సభల ఏర్పాటు, మైక్ ప్రచారం ఏర్పాట్లుపై ముందస్తు అనుమతులు తప్పనిసరి అన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయంలు, సచివాలయాల్లో బ్యానర్స్, పోస్టర్లు, ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి, ఇతర శాఖల మంత్రుల ఫోటోలను 48 గంటల లోపు తొలగించామన్నారు. ప్రైవేటు స్థలాలు, ఇళ్లపై ఉన్న హోర్డింగ్ ఫ్లెక్సీలు 72 గంటల్లో తొలగించామని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఏప్రిల్ 15 లోపున ఓటు నమోదుకు మరో అవకాశం ఇచ్చారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఎవరైనా రూ.50 వేలకు మించి ఎక్కువ మొత్తంలో తీసుకువెళ్లరాదని, తీసుకు వెళితే తప్పని సరిగా రసీదు, సంబంధిత ధ్రువీకరణ పత్రాలు ఉండాలని లేకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. పార్టీ సమావేశాలు, బహిరంగ సభలు నిర్వహించుకోవడానికి ముందు దరఖాస్తు చేసుకున్నవారికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని వివరించారు.

కనకదుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవాల ప్రారంభం

పాలకొల్లు అర్బన్: ఆధ్యాత్మిక ఉత్సవా లు ప్రజల మధ్య ఐక్యతకు చిహ్నాలుగా నిలుస్తాయని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లు పట్టణంలోని యడ్లబజారులోని శ్రీకనకదుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవాలు మంగళవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గుడాల గోపి-మంగతాయారు దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలుచేశారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవాలకు అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన గుడాల గోపి దంపతులకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కావలి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ కావలి చంద్రావతి, ఈవో ఎన్ సతీష్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, ఆలయాల చైర్మన్‌లు కోరాడశ్రీనివాసరావు, జోగివెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సిద్ధాంతంలో..

పెనుగొండ: సిద్ధాంతంలో విజయగోపాలస్వామి జగన్మాతలు రుక్మిణి,సత్యభామలు, మాధవ స్వామి జగన్మాతలు శ్రీదేవిభూదేవి వార్ల కల్యాణం కనుల పండుగగా నిర్వహించారు. మంగళవారం రాత్రి ఆలయ అర్చకులు ఖండవల్లి సీతారామాచార్యులు(రాంబాబు), ఖండవల్లి శోభనాద్రాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవార్లకు కుంకుమార్చనలు, అభిషేకంలు , ధ్వజారోహణ, అంకురార్పణ, బలిహరణలు నిర్వహించారు.

సంపూర్ణ ఆరోగ్యానికి సేంద్రియ ఉత్పత్తులు మేలు



చినమల్లంలో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనుగొండ: సంపూర్ణమైన ఆరోగ్యానికి సేంద్రియ వ్యవసాయంతో వచ్చే ఉత్పత్తులు మేలు చేస్తాయని నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ కృపావతి అన్నారు. మంగళవారం చినమల్లంలోని రైతు మిద్దే శ్రీనివాస్ పొలంలో వేసిన మిర్చిపంటను పరిశీలించి, సేంద్రియ వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మిర్చి పంటలో ప్రధానంగా తామర పురుగు ఎక్కువగా గమనించామని, దీని నివారణకు ఉల్లి కషాయం పిచికారీ చేయాలన్నారు. మిర్చి పంటలో అంతర పంటగా నవధాన్యాలు సాగు చేయవచ్చన్నారు. దీని వల్ల అధిక రాబడి ఉంటుందనానరు. సామూహికంగా జీవామృతం తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి బి.ఆదినారాయణ, ఐసీఆర్‌పీ ఉప్పలపాటి శ్రీదేవి, కుడుపూడి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

పెనుగొండ: మానసిక ఉల్లాసాన్ని కాపాడడంలో క్రీడలు దోహదపడతాయని ఎస్వీకేపీ అండ్ డాక్టర్‌కేఎస్ రాజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు అన్నారు. మంగళవాంర క్రాంప్టన్ శ్రీలక్ష్మి డిస్ట్రిబ్యూటర్ జిల్లా డీలర్స్ కొవ్వూరి సత్రెడి శ్రీ వంశీకృష్ణలు కబడ్డీ మెన్, బాస్కెట్ బాల్ మెన్, టేబుల్ టెన్నిస్ మెన్, విమెన్, బాక్సింగ్ మెన్, విమెన్ జట్లుకు చెందిన 50 మంది క్రీడాకారులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, ఫిజికల్ డైరెక్టరు డాక్టర్ బి.బాపిరెడ్డి చేతుల మీదుగా క్రీడా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడూతూ కళాశాల నుంచి ఎంతో మంది ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దామన్నారు. కళాశాలలో క్రీడా సదుపాయాలను, క్రీడాకారుల స్ఫూర్తిని ప్రోత్సాహకులు సత్రెడ్డి వంశీకృష్ణలు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, పాలకవర్గ అధ్యక్షుడు పితాని సూర్యనారాయణ, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్ పాల్గొన్నారు.

క్షీరారామలింగేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం హుండీ ఆదాయం రూ. 13,37,985లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారి వర్ధినీడి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో హుండీలను తెలిచారు. అనంతరం లెక్కించగా నగదుతో పాటు 23.350 గ్రాముల బంగారం, 2.80 కేజీల వెండి వచ్చిందన్నారు. అలాగే వివిధ దేశాల కరెన్సీ 10 నోట్లు వచ్చినట్లు తెలిపారు. 90 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మార్కెట్ పన్ను వసూళ్ల వేలం వాయిదా

నరసాపురం: నరసాపురం మునిసిపాలిటీలో డైలీమార్కెట్ పన్ను వసూళ్లకు సంబంధించి హక్కు కల్పించేందుకు మంగళవారం నిర్వహించతలపెట్టిన బహిరంగ వేలం పాటను వాయిదా వేసినట్టు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మంగళవారం విలేకరులకు చెప్పారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకుని తిరిగి పాట ఎప్పుడు నిర్వహించేదీ తెలియజేస్తామన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన

పాలకొల్లు అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ప్రలోభాలకు గురికావద్దని పాలకొల్లు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కుడుపూడి సతీష్ చెప్పారు. మండలంలోని పెదమామిడిపల్లి, వరిధనం గ్రామ సచివాలయాల వద్ద మంగళవారం రాత్రి ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు చాలా ప్రాధాన్యతతో కూడిన దన్నారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలకు అతిక్రమిస్తే పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. ఎస్సై డి హరిహకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి ఉమా ఇంద్రేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

పెనుమంట్ర: స్థానిక శ్రీఉమా ఇంద్రేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు బుధవారం నుంచి 24వ తేదీ వరకు అత్యంత నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జీఎస్ఎస్ శ్రీనివాస్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 20న ఉదయం స్వామివారిని పెండ్లికుమారుడిగా, అమ్మవారిని పెండ్లికుమార్తెగా చేసి సాయంత్రం శ్రీఉమా ఇంద్రేశ్వరస్వామివారికి కల్యాణోత్సవం నిర్వహిస్తారని, ఈ సందర్భంగా 24వ తేదీ వరకు ఆలయ ఆవరణలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాన్నారు.